క్లుప్తంగా

నేటి నుంచి చాగల్లు రైల్వే గేట్ మూసివేత

చాగల్లు: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ట్రాక్ అత్యవసర మరమ్మతులు చేపట్టనున్నారు. ఇందుకోసం చాగల్లు రైల్వే గేట్‌ను ఈ నెల మూడు నుంచి ఆరో తేదీ వరకూ నాలుగు రోజుల పాటు మూసివేస్తామని మంగళవారం రైల్వే అధికారులు తెలిపారు. ట్రాక్‌ను ఎత్తు చేసే పనుల్లో భాగంగా గేట్ వద్ద రహదారిపై మరమ్మతులు చేస్తున్నట్టు వివరించారు. కావున మల్లవరం, మార్కొండపాడు, చంద్రవరం గ్రామాల వాహనదారులు ఈ నాలుగు రోజులూ ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకొని సహకరించాలని రైల్వే అధికారులు కోరారు.

గౌడ సంఘ నేతలకు రాష్ట్ర బీసీ సంఘంలో చోటు

ద్వారకాతిరుమల: మండలంలోని ఇద్దరు గౌడ సంఘ నేతలకు రాష్ట్ర బీసీ సంఘంలో చోటు దక్కింది. హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో పంగిడిగూడెంకు చెందిన పరసా వీర్రాజును బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, తిరుమలంపాలెంకు చెందిన మిడతా చందు గౌడ్‌ను కార్యదర్శిగా ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నియమించారు. ఆయన జారీ చేసిన నియామక పత్రాలను గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం వీర్రాజు, చందులకు అందించి, అభినందించారు.

ఆలయం వద్ద అన్నదానం

తాళ్లపూడి: ప్రక్కిలంక గ్రామంలోని భక్తాంజనేయ స్వామి వారి ఆలయ 23వ వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం భారీఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. సుమారు ఐదు వేల మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆర్యవైశ్య సంఘం మండల శాఖ గౌరవాధ్యక్షుడు సింహాద్రి జనార్దనరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు సొలస విశ్వనాథం, కార్యదర్శి గిరిధర్ గాంధీ మాట్లాడుతూ దాతలు, భక్తుల తోడ్పాటుతో గత 23 ఏళ్లుగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ప్రతి మంగళవారం ఆలయం వద్ద అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు.

పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరి



టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: వ్యాధి సోకిన పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గకుండా శాశ్వతంగా నివారించాలంటే వాటికి విధిగా గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ సూచించారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మంగళవారం ఆయన పట్టణంలోని పశువుల ఆసుపత్రిలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆదినారాయణ మాట్లాడుతూ రైతులు తమ పశువులకు చెవి పోగులు వేయించడం ద్వారా ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి.ఋషిప్రసాద్, లైవ్ స్టాక్ అధికారి బీహెచ్ రమేష్, లైవ్ స్టాక్ అసిస్టెంట్ జి.ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

తూర్పుచోడవరంలో..

నల్లజర్ల: నాలుగు నెలల దూడలు, పెద్ద పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్టు నల్లజర్ల పశువైద్యశాఖ ఏడీఏ జాన్ మోజేస్ వెస్లీ తెలిపారు. తూర్పుచోడవరం పశువైద్యశాలలో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మండలంలోని అన్ని గ్రామాలలో నెల పాటు ఈకార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. తెల్ల పశువులు 8619, నల్ల పశువులు 21,691 ఉన్నాయన్నారు.

తల్లి మందలించిందని ..



దూసనపూడి సంతోష్‌కుమార్

నిడదవోలు: తల్లి మందలించిందనే మనస్థాపంతో స్థానిక సిద్ధార్థ హాస్పిటల్ సమీపంలో నివాసం ఉండే దూసనపూడి సంతోష్‌కుమార్ అనే 17 టీనేజర్ కనిపించకుండా పోయాడు. సోమవారం జరిగిన ఈ ఘటనపై తండ్రి సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిడదవోలు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సంతోష్‌కుమార్ పదో తరగతి పూర్తి చేశాడు. ఎవరికైనా అతడి ఆచూకీ తెలిస్తే నిడదవోలు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై నాగరాజు కోరారు.

సారాతో ఒకరి అరెస్టు

నల్లజర్ల: అనంతపల్లి గ్రామంలోని ఓ ఇంటిపై మంగళవారం ఎస్ఈబీ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో వెలగన మంగారావు అనే వ్యక్తిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 23 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఈబీ దేవరపల్లి సీఐ డి.సుధ తెలిపారు. ఈ దాడిలో ఎస్ఐ పి.సుధీర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

పందేలకు సై

- పందెపు పుంజులకు మెనూ ప్రకారం ఆహారం
- పెద్ద బరిలో ఒక్కో పందెం రూ.లక్షకు పై మాటే
- ఒప్పందాలు కుదుర్చుకున్న పందెం రాయుళ్లు
- ఊపందుకున్న పుంజుల విక్రయాలు



పందేల కోసం కోడి పుంజులకు శిక్షణ ఇస్తున్న ప్రాంతం

ద్వారకాతిరుమల: సంక్రాంతి వచ్చేస్తోంది.. కోడి పందేలకు సమయం దగ్గర పడుతోంది. దాంతో పెంపకందారులు కోడి పుంజులకు ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. ఎంతో శ్రద్ధతో పందేలకు వాటిని సిద్ధం చేస్తున్నారు. శిక్షణలో భాగంగా పందెం పుంజులు ఇప్పటికే నువ్వా.. నేనా అన్నట్టు తలపడుతున్నాయి. నిత్యం ఉదయం నుంచే అవి కఠోర సాధన చేస్తున్నాయి. సంక్రాంతి పండగకు మరో 11 రోజుల సమయం మాత్రమే ఉండడంతో పందెం పుంజుల అమ్మకాలు సైతం ఊపందుకున్నాయి. కాకి, నెమలి, అబ్రాసు, డేగ, రసంగి, సీతువ, పూల, పర్ల, కెక్కిరాయి వంటి పలు జాతుల పుంజులు సమరానికి సై అంటున్నాయి. మెట్ట ప్రాంతమైన ద్వారకాతిరుమల మండలంలోని రాళ్లకుంట, కొమ్మర, మలసానికుంట, ద్వారకాతిరుమల, దొరసానిపాడు, పంగిడిగూడెం, గుణ్ణంపల్లి, మారంపల్లి తదితర ప్రాంతాల్లోని శిబిరాల్లో పుంజుల పెంపకం జరుగుతోంది.

పందెం ప్రియుల హడావుడి

సంక్రాంతి పండుగ దగ్గర పడుతుండడంతో జిల్లా వ్యాప్తంగా అప్పుడే పందెం ప్రియుల హడావుడి మొదలైంది. ఈ సారి ఎలాగైనా గెలుపు సాధించాలన్న పట్టుదలతో వారు పందెం కోళ్లను బలిష్టంగా తయారు చేస్తున్నారు. పెద్ద బరిలో ఒక్కో పందేన్ని లక్ష రూపాయలకు పైగా వేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే కొందరు పందెం రాయుళ్లు పలు ప్రాంతాల వారితో పందేల ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. బరిలో వారు దింపే పుంజులకు దీటుగా మరింత బలమైన పుంజులను దింపాలన్న లక్ష్యంతో వాటిని సిద్ధం చేస్తున్నారు.

మెనూ ప్రకారం ఆహారం

పుంజుల పెంపకందారులు నిత్యం బాదంపప్పు, జీడిపప్పు, మటన్ కైమాతో పాటు, తాటిబెల్లం, నల్ల నువ్వులు, ఎండు ద్రాక్ష, ఎండు కర్జూరం, సోంపు, అంజూర, అక్రోటు, పిస్తా, బాదంతో తయారు చేసిన ఉండలను వాటికి అందిస్తున్నారు. వీటి మెనూ చూస్తే ఆహా.. ఏమీ రాజభోగము అనిపిస్తోంది. ఉదయం ఆరు గంటలకు పందెం రాయుళ్లు వాటిని చెరువుల్లోను, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నీటి తొట్టెల్లో ఈదిస్తున్నారు. ఆ తరువాత వాకింగ్ చేయించి, కొద్దిసేపు ఎండలో కడుతున్నారు. 9 గంటలకు అల్పాహారంగా బాదంపప్పు, జీడిపప్పు, మటన్ కైమాలను పెడుతున్నారు. తాటి బెల్లాన్ని నువ్వుల నూనెతో కలిపి, ఉండలుగా చేసి వాటికి తినిపిస్తున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు చోళ్లు, గంట్లు, వడ్లతో కూడిన మేత పెడుతున్నారు. వాటికి ఎండ తగులకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షెడ్లలోని గాబుల్లో ఉంచుతున్నారు. సాయంత్రం ఆరు గంటలకు పొయ్యి మీద అట్లపెనం పెట్టి, దానిపై చల్లిన వేడి నీటిని పుంజుల దేహంపై పూస్తున్నారు. ఆ తరువాత బలం కోసం రెవిటాల్ వంటి మందులు వేస్తున్నారు. ఇలా రోజుకు ఒక్కో పుంజుకు రూ.200 పైగా ఖర్చు చేస్తున్నారు. ప్రాక్టీస్‌లో వాటికి ఎన్నో మెళకువలు నేర్పిస్తున్నారు. ప్రస్తుతం ఒక్కో పుంజు ధర జాతిని బట్టి రూ.10 వేల నుంచి రూ. లక్షకు పైగా పలుకుతోంది. కాగా పుంజులకు కాపలాగా జాతి శునకాలను ఏర్పాటు చేశారు.

కత్తుల తయారీలో నిమగ్నం

పందేల్లో కోడి కత్తుల తయారీదారులదే హవా. బరిని బట్టి వారు డబ్బులు వసూలు చేస్తుంటారు. పండుగ దగ్గర పడుతుండడంతో కత్తుల తయారీలో వారు నిమగ్నమయ్యారు. ఇక పందెం రాయుళ్ల విషయానికొస్తే ఈ సారి కూడా పోలీసులపై గెలుపు తమదేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆ క్రమంలోనే పందేల నిర్వహణకు సిద్ధమవుతున్నారు.



పందేల శిక్షణలో భాగంగా తలపడుతున్న పందెం పుంజులు



బాదం పప్పు, నువ్వుల నూనెతో తయారు చేసిన తాటిబెల్లం ఉండలు తింటున్న పందెం పుంజు



నీటి తొట్టెలో ఈదుతున్న పందెపు పుంజు

మద్దూరులో మంత్రి వనిత పర్యటన



మద్దూరు హైస్కూల్లో డైనింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: మండలంలోని మద్దూరు జెడ్పీ హైస్కూల్లో రూ.22 లక్షల వ్యయంతో నిర్మించిన డైనింగ్ హాలు, సైకిల్ షెడ్‌ను రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్య శిబిరాన్ని మంత్రి సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. అదే గ్రామంలో సాయిబాబా కాలనీలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించే సిమెంట్ రోడ్డుకు మంత్రి శంకుస్థాపన చేశారు. తర్వాత రాజరాజేశ్వరీ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం నుంచి మొదలుపెట్టే ఆలయ మండప నిర్మాణ పనుల గురించి మంత్రి ఆరా తీశారు. ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కాకర్ల నారాయుడు, మద్దూరు సొసైటీ అధ్యక్షుడు తోట నారాయణ, సంగీతం చినవెంకటేశ్వర్లు, ఉప్పులూరి సూరిబాబు, కోనా శ్రీనివాస్, పోలిశెట్టి సర్వేశ్వరరావు, గాజుల వీర వెంకట్రావు, శివాలయం చైర్మన్ సంగీతం సోమరాజు పాల్గొన్నారు.

విద్యారంగ పురోభివృద్ధిపై విమర్శలా?

- విద్యార్థులకు ట్యాబ్‌లు ఇస్తే చెడిపోతారా?
- విపక్షాల తీరు దారుణం
- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత
- చాగల్లు, పెద్దేవం గ్రామాల్లో ట్యాబ్‌ల పంపిణీ

చాగల్లు: మెరుగుపడుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలను చూసి ఓర్వలేక విపక్షాలు రాజకీయం చేస్తున్నాయని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత విమర్శించారు. మండలంలోని నాలుగు జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన 287 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు మంత్రి వనిత చేతుల మీదుగా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. చాగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. పేద విద్యార్థుల్లో చక్కటి కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించడానికి, మంచి భవిష్యత్తు అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెడితే, దానిని కూడా విపక్షాలు రాజకీయం చేయడానికి ప్రయత్నించాయన్నారు. అందరికీ డిజిటల్ విద్య అందించాలనే ప్రధానోద్దేశంతో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు ఎంతవరకూ అవసరమో అంతే సమాచారాన్ని బైజూస్ యాప్ ద్వారా ఆ ట్యాబ్‌ల్లో ఉంచి లాక్ వేస్తారని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, పార్టీమండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, సొసైటీ అధ్యక్షుడు గూడపాటి శివ, ఎంపీటీసీ సభ్యులు ఉన్నమట్ల విజయకుమారి, ఎస్ అర్జునుడు, ఎస్‌కే పాషా, తాళ్లూరి రమ్య, ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, సర్పంచులు కుదప రాంబాబు, మట్టా వెంకట్రావు, కొయ్యే మణి, సీనియర్ నాయకులు లకంసాని సూర్యప్రకాశరావు, గేడా శ్యామ్, ఎంఈవో వి.ఖాదర్‌బాబు, పాఠశాల హెచ్‌ఎం. పి.వీర్రాజు పాల్గొన్నారు.



చాగల్లు జెడ్పీ హైస్కూల్లో ట్యాబ్‌లు పొందిన విద్యార్థులతో మంత్రి తానేటి వనిత,



పెద్దేవం జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ట్యాబ్‌లు అందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

తాళ్లపూడి మండలంలో 290 మందికి..

తాళ్లపూడి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని పెద్దేవం జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద మంగళవారం మండలంలోని వివిధ జెడ్పీ హైస్కూళ్లకు చెందిన 290 మంది 8వ తరగతి విద్యార్థులకు ఆమె ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ పిల్లలకు మనం ఇవ్వగలిగే ఆస్తి చదువు ఒక్కటే అని బలంగా నమ్మిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆయన ఆశయాన్ని నెరవేర్చేలా తల్లిదండ్రులను తమ పిల్లలను ప్రోత్సహించాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ధ్యేయంగా పథకాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, నాయకులు తోట రామకృష్ణ, సిద్ధంశెట్టి కృష్ణ, కొలిశెట్టి నాగేశ్వరరావు, పోశిన శ్రీకృష్ణదేవరాయులు, ఎంఈవోలు సీహెచ్ బాలామణి, సీహెచ్ నెహ్రూజీ, హెచ్‌ఎం సీహెచ్ నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు మండలంలో 290 మందికి..

కొవ్వూరు: మండలంలోని ఎనిమిదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన ట్యాబ్‌లను మంగళవారం అందజేశారు. దొమ్మేరు, మద్దూరు గ్రామాల హైస్కూళ్లలో నిర్వహించిన కార్యక్రమాల్లో మండలంలోని వివిధ హైస్కూళ్లకు చెందిన 290 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత చేతుల మీదుగా వాటిని అందజేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కాకర్ల నారాయుడు, దొమ్మేరు సర్పంచ్ తానేటి కుమారి, సొసైటీ అధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణ రాజు, నాయకులు బొల్లిన సతీష్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మారిశెట్టి సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, శ్రీరామా సొసైటీ అధ్యక్షుడు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, ఐ.పంగిడి సర్పంచ్ గోశాల నాగర్జున తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



వేళ్లచింతలగూడెంలో పోటీలను ప్రారంభించాక క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తోందని, ఆసక్తి గల క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని వేళ్లచింతలగూడెంలో నిర్వహిస్తున్న టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా రంగారావు, మధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. కోదండ రామాలయం ఆలయ కమిటీ సారథ్యంలో పోటీలు జరుగుతాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ కన్న తల్లిని, సొంత గ్రామాన్ని మరచిపోకుండా గత ఐదేళ్లుగా తండ్రి రంగారావు జ్ఞాపకార్థం ఘంటా మధుకృష్ణ సంక్రాంతికి వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తూ యువతలో నూతనోత్తేజాన్ని నింపుతున్నారంటూ కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ), పార్టీ నాయకులు పిన్నమనేని వెంకటరత్నం (చినబాబు), మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, శాఫ్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, కొర్లపాటి శ్రీరామచంద్రరావు, దుగ్గిరాల రమేష్‌బాబు, సర్పంచ్ జి. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పొగాకు రైతులను ఆదుకుంటాం

- బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్
- తుపానుకు దెబ్బతిన్న పంటల పరిశీలన
- పోతవరంలో రైతులతో సమావేశం

నల్లజర్ల: మిచాంగ్ తుపాను వల్ల దెబ్బతిన్న మండలంలోని పోతవరం పరిసర గ్రామాల్లోని వర్జీనియా పొగాకు పంటను పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆ గ్రామానికి చెందిన రైతు సంఘ నాయకుడు పెండ్యాల వీరరాఘవులు ఇంటి వద్ద రైతులతో బోర్డు చైర్మన్ సమావేశమయ్యారు. పొగాకు బోర్డు అన్ని విధాలా రైతులను ఆదుకుంటుందని చెప్పారు. సంక్షేమ నిధి నుంచి హెక్టార్‌కు రూ.10 వేల చొప్పున సహాయం అందించి, పంట అమ్మిన తర్వాత ఆ సొమ్మును జమ చేసుకుంటామని వివరించారు. పంట రుణంగా మరో రూ.లక్ష అందించాలని రైతులు కోరారు. ఒక్కో బ్యారన్‌కు 35 క్వింటాళ్ల కొనుగోలు పరిమితి ఉంది. అదనంగా పండించిన రైతుల నుంచి వసూలు చేసిన 1 శాతం సెస్ నుంచి తమను ఆదుకోవాలని పలువురు పంట దెబ్బతిన్న రైతులు కోరారు. ఆయన వెంట పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజినల్ మేనేజరు ఆదిశేషయ్య, ఎస్‌జీఓ హేమశ్రీ , రైతులు ప్రత్తిపాటి సత్యనారాయణ, సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు, కానూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- రూ.3 వేలకు పెంచిన, కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ

దేవరపల్లి: పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసి ఆదుకుంటోందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. పెంచిన పింఛను సొమ్ము రూ.3 వేలు, కొత్తగా మంజూరైన మంజూరైన పింఛనుదారులకు వైఎస్సార్ పింఛన్ కానుకలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. స్థానిక మండలం పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు.

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 44,627 మందికి పింఛన్లు అందజేస్తున్నట్టు చెప్పారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరొకసారి ఆశీర్వదించాలని, ఎమ్మెల్యేగా తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) మాట్లాడుతూ ప్రతి కుటుంబానికీ ఐదేళ్లలో రూ.1.68 లక్షల పింఛన్ అందుతుందన్నారు. కార్యక్రమంలో సభలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, సర్పంచ్ కడిమి వీరకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, పార్టీ నియోజకవర్గ మహిళా కన్వీనర్ గారపాటి రమాప్రభ, మండల కన్వీనర్ కడలి హైమావతి, మండల సచివాలయాల కన్వీనర్ కుసులూరి వెంకటసతీష్ తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో దివ్యాంగ బాలికకు రూ.3000 పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



నిడదవోలు మండలం కంసాలిపాలెంలో లబ్ధిదారులకు పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

కంసాలిపాలెంలో..

నిడదవోలు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకుని పింఛన్ కానుక ద్వారా అవ్వా తాతలకు అండగా నిలిచారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని కంసాలిపాలెంలో నూతనంగా మంజూరైన వైఎస్సార్ పింఛన్ కానుక నగదును లబ్దిదారులకు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మంగళవారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాల్లో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం రూ.3 వేలు పింఛన్ పంపిణీ చేయడం బృహత్తర కార్యక్రమమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, పంచాయతీ సర్పంచ్ కొండపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు మలిశెట్టి వీరప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి రక్షణగా సురక్ష

దేవరపల్లి: పేదల ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష రక్షణగా నిలిచిందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. గౌరీపట్నం గ్రామ సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన రెండో విడత జనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో ఏర్పాటు చేసిన వార్డులను ఆయన పరిశీలించి, వైద్యులతో మాట్లాడారు. శిబిరంలో 388 మందికి వైద్యులు జె.సతీష్, సఫీ, సింధూజ పరీక్షించారు. ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, సర్పంచ్ రాయి అన్నపూర్ణ, ఉప సర్పంచ్ ఆండ్రు రమేష్ బాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: మండలంలోని సింగవరంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష–2 మెడికల్ క్యాంపును జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, సర్పంచ్ పెన్మెత్స వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు పెన్మెత్స నిర్మల ప్రారంభించారు. సమిశ్రగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి శివాజీ పర్యవేక్షణలో స్పెషలిస్ట్ డాక్టర్లు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ పెన్మెత్స రామరాజు, ఎంపీడీఓ పి.శామ్యూల్ పాల్గొన్నారు.

కొవ్వూరులో సురక్ష శిబిరాల షెడ్యూల్ ఇలా..

కొవ్వూరు: మునిసిపాలిటీ పరిధిలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఈ నెల మూడో తేదీ నుంచి మార్చి ఆరో తేదీ వరకూ నిర్వహించనున్నట్టు కమిషనర్ బి.శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు.3న ఒకటో సచివాలయం పరిధిలో శ్రీరామా కాలనీలోను, 19న క్రిస్టియన్ పేటలోను,17న ఇందిరమ్మ కాలనీలోను, 24న ఆవుల వారి వీధిలోను, ఈనెల 31న మద్దిపట్ల వారి వీధిలోను, ఫిబ్రవరి 7న గౌతమీ నగర్–1 సచివాలయం పరిధిలోను,14న గౌతమీనగర్–2 పరిధిలోను, 21న ఔరంగాబాద్‌లోను, 28న ఎన్‌జీవో హోమ్ రామా సొసైటీ–1 సచివాలయం పరిధిలోను, మార్చి 6న ఎన్‌జీవో హోమ్ రామా సొసైటీ–2 సచివాయం పరిధిలోను జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహిస్తామన్నారు.ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రతీ సచివాలయం పరిధిలోను షెడ్యూలు ప్రకారం ఈ వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆర్బీకేలతో అన్నదాతలకు భరోసా

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- తిమ్మరాజుపాలెం, కంసాలిపాలెంలో భవనాల ప్రారంభం

నిడదవోలు రూరల్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన రైతు భరోసా కేంద్రాలతో అన్నదాతలకు భరోసా దక్కిందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని తిమ్మరాజుపాలెం, కంసాలిపాలెం గ్రామాల్లో ఒక్కొక్కటి రూ.23.94 లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్‌బీకే భవనాలను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ ఆర్‌బీకేల సేవలను రైతులు సక్రమంగా ఉపయోగించుకుని సాగు ఖర్చులను తగ్గించుకోవాలన్నారు. ధాన్యం సేకరణతో పాటు అందుబాటులో ఎరువులు, పురుగు మందులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎర్ర కాలువ ముంపుతో నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. తిమ్మరాజుపాలెంలో ఉప్పుతో ఏర్పాటు చేసిన ఆర్‌బీకే నమూనాను ఎమ్మెల్యే పరిశీలించి సచివాలయ సిబ్బందిని అభినందించారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, సర్పంచులు ముప్పిడి చంద్రశేఖర్, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు పడాల రంగారావు, మలిశెట్టి వీరప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, నాయకులు తోట సుబ్బారావు, కొండపల్లి శ్రీనివాస్, నాయకులు పడాల రంగారావు, ఉప్పాటి వెంకటేష్ పాల్గొన్నారు.



ఆర్‌బీకే నమూనాతో సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, పార్టీ శ్రేణులు

దళితవాడల అభివృద్ధికి ప్రాధాన్యం



సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: దళితవాడల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నట్టు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. దేవరపల్లి దళితవాడలోని వివిధ ప్రదేశాల్లో రూ.52 లక్షల వ్యయంతో నిర్మించే సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తలారి మాట్లాడుతూ మైనింగ్ నిధులు రూ.40 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.8 లక్షలు, గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.4 లక్షల వ్యయంతో ఈ దళితవాడలోని పలు ప్రదేశాల్లో సిమెంట్ రోడ్లు నిర్మిస్తున్నట్టు తెలిపారు. వాటర్ ట్యాంకు నుంచి శ్మశానం వరకూ సిమెంట్ డ్రైనేజీ నిర్మిస్తున్నట్టు చెప్పారు. శ్మశానవాటిక వద్ద ట్యాంకు, డ్రైనేజీల నిర్మాణానికి కృషి చేస్తానని ఎంపీపీ కేవీకే దుర్గారావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీరకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత పాల్గొన్నారు.